# అద్దం తిరిగిన కథ

**(29-3-1990 ఆంధ్రభూమి వార పత్రిక)**

"రేపు మీ భోజనం మా ఇంట్లోనే" ఆ మాట ఎప్పుడు చెప్దామా అని వువ్విళ్లూరుతున్న విజయ చెప్పనే చెప్పింది చివరికి.

"ఎందుకండీ?..." మొహమాట పడిపోయాడు శ్రీనివాసరావు.

"రేపు పండగ కదండీ... పండగపూటా రోజూ తినే ఆ హోటల్ భోజనమే ఏం తింటార్లెండి?... రేపు ఉగాది కదా."

"ఆ ఔనౌను... రేపు ఉగాది ... కానీ పాపం మీ కెందుకండీ శ్రమ?... మీ అమ్మగారు కూడా ఊళ్ళో లేరు..."

శ్రమేం కాదులెండి. అలా ఎందుకను కుంటారు? ఇదేకదా మిమ్మల్ని మొట్టమొదటిసారి మా ఇంటికి భోజనానికి పిలవడం కాదనకండి.

"మీరింతగా చెప్తుంటే కాదని ఎలా అంటాను..." ఒప్పుకున్నాడు మొహమాట పడుతూనే.

"అమ్మయ్య... థాంక్స్... రేపు రెండుపూటలా మా ఇంట్లోనే భోజనం గుర్తుంచుకోండి"

"రెండపూటలానా? ఎందుకండీ అంత శ్రమ?"

"అదిగో అస్తమానం శ్రమ శ్రమ అంటారేవిటి? మేము వండుకోవట్లేదా తినడంలేదా?... అదేలెండి.. రోజూ వంట చేసేది మా అమ్మే అనుకోండి... అయితేనేం? మా అమ్మ అయితేనేం? నేనయితేనేం?"

"అబ్బే... ఆహా... అదేంకాదు... ఔను... శ్రమేంకాదు... మీరు వొండు కోవట్లేదా?... తినడంలేదా?... అసలు వంటపని ఓ పనే కాదండీ... దానికి శ్రమ ఏం ఉంటుందండీ?"

"భలేవారే... అలా అంటే నేనొప్పుకోను. వంటపని ఓ పని కాకపోవడం ఏమిటి? రెండు పూటలా వంటపనితో ఏ ఆడదైనా ఎంత కష్టపడుతుందో మీకేం తెలుసు? మా అమ్మ వంటింట్లో ఎంత అవస్త పడుతూ ఉంటుందో నేను చూస్తూనే వుంటానుగా... వేడిగా ఆ సెగదగ్గిర పని చాలా బోర్ బాబూ? అందుకే నేనెప్పుడూ ఆ వంట పని జోలికి పోను. ఏదో...ఇప్పుడు అమ్మ ఊళ్లోలేదు కాబట్టి తప్పదు మరి.."

ఇలా అంటే అలా అంటోంది...అలా అంటే ఇలా అంటోంది. ఏడవాలో నవ్వాలో తెలియక నోరెళ్ళబెట్టాడు.

★ ★ ★

పెరట్లో బాత్‌రూంలో స్నానం చేసి తిరిగి లోపలికి వస్తుంటే పట్టుకుంది గాయత్రి. ఎడవమైపువాటాలో అద్దెకు ఉంటారు గాయత్రీవాళ్లు. తల్లిపోయింది గాయత్రికి. తండ్రి, కూతురు ఇద్దరే ఉండేది వాళ్లింట్లో కుడివైపు వాటాలో శివరామయ్య గారు, భార్య కూతురు విజయ ఉంటారు మధ్యవాటాలో అద్దెకి ఉంటాడు శ్రీనివాసరావు.

"ఏవండోయ్ శ్రీనివాస్‌రావు గారూ..."

"ఆ... పిలిచారా?"

"అవునండీ.. రేపు ఉగాది కదా.. మీ భోజనం మా ఇంట్లోనే.. హోటల్‌కి వెళ్లకండి రేపు... కాసేపట్లో మా నాన్నగారు చెప్తారుమీకు ఈలోపల ముందు నేను చెప్తున్నా" సిగ్గు వొలకబోసింది గాయత్రి.

"అరే... భోజనమా? మరి... మరి...."

"ఏవిటండీ? మరి.... మరి... అంటూ నానుస్తున్నారు. హోటల్ భోజనం తప్ప ఇంటిభోజనం పడదా మీకు?"

"అబ్బే... అది కాదండీ... మరి... రేపు భోజనానికి విజయగారు పిలిచారండీ"

పిలిచిందీ... పళ్లు నూరుకుంది గాయత్రి.

నాకంటే ముందే చెప్పిందీ?,, తెల్లారడం పాపం... హు...

"పోన్లెండి... రేపు మధ్యాహ్నం భోజనానికి తనుపిలిచి ఉంటుంది. రేపురాత్రి మా ఇంట్లో తినాలి"

"అహ లేదండీ... రెండుపూటలా వాళ్లింట్లోనే అని చెప్పారు"

చెప్తుంది... చెప్తుంది... నా వల్లో ఎక్కడ పడిపోతారో అని అలాగే చెప్తుంది... మళ్లీ పళ్ళు నూరుకోడంలో నాలిక్కొరుక్కుంది.. అబ్బా...

"చూడండీ.. అవిడగారితో ఎలా చెప్పుకుంటారో ఏం చెప్పుకుంటారో నా కనవసరం. మధ్యాహ్నం మటుకే వాళ్లింట్లో చేస్తానని చెప్పెయ్యండి. గుత్తి వంకాయ కూర మీకిష్టమా కాదా?"

"చాలా చాలా ఇష్టం అండీ..."

"రేపురాత్రి ఆ కూరే చేస్తాను. రేపు రాత్రి మీరు మీ ఇంటికి భోజనానికి కొస్తున్నారు" హిప్నటైజ్ చేస్తున్నట్టే అంది.

"అలాగేనండి.. విజయ గారితో చెప్పేస్తాను వాళ్లింట్లో ఒకపూట తింటానని చెప్పేస్తానులెండి... మీరువంకాయలు కొనేసారా? నన్ను తెచ్చిపెట్ట మన్నారా?" అప్పుడే నోట్లో నీళ్లూరి పోతున్నాయి అతనికి.

"మంచివి చూసి ఏరి నేను తెచ్చుకుంటాన్లెండి బజారెళ్లి. మీ మొగాళ్లకి మంచివి ఏరడం తెలుస్తుందా? బేరం చెయ్యడం తెలుస్తుందా?" టక్కున జవాబిచ్చింది.

బుర్ర గోక్కుంటూ ఓ వెర్రినవ్వు నవ్వి ఊరుకున్నాడు.

★ ★ ★

ఆ సాయంత్రం విజయని పలకరించాడు.

"చూడండి విజయగారూ.. రేపు పగలు ఒకపూట మీ ఇంట్లో తింటాను. రాత్రి భోజనానికి గాయత్రిగారు పిలిచారు"

పిల్చిందీ.. అయింది.. అనుకున్నంతా అయింది.. అన్నిటికీ నాతో పోటి ఆవిడగారికి... ఎలాగైనా మీరు నా వల్లో పడకుండా తన వల్లోనే పడాలని.. ఆవిడగారినే పెళ్లాడాలని మహా కోరిక ఆ మహాతల్లికి. ఏం? నాకేం తక్కువనీ? నన్నెందుకు ప్రేమించకూడదు మీరు? నాకు తెలుసు.. మీకు నేనంటేనే ఇష్టం. నన్ను తప్పకుండా ప్రేమిస్తూనే ఉండి. ఉంటారు మీరు. సందర్భం వచ్చినపుడు చెప్పచ్చని చూస్తుండి ఉంటారు. అందుకే సందర్భం కలిసొస్తుందనే మిమ్మల్ని భోజనానికి పిలవాలన్న ఆలోచనొచ్చి మా నాన్నగారితో, పాపం ఆయన పండగపూట హోటల్లో ఎందుకు. మనింటికి పిలుద్దామని చెప్పాను. మనసులోనే అనుకుంది ఈ మాటలన్నీ విజయ.

"పోన్లెండి... ఒక పూటైనా వొస్తానంటున్నారు... సంతోషం"

"అయ్యో! ఎంత మాట మొదట పిలిచింది మీరే కదా అసలు?..." ఒక పూట కూడా రాకుండా ఉంటానా? తప్పకుండా వొస్తాను" ఈ మాటతో విజయలో మళ్ళీ ఉత్సాహం పుంజుకుంది.

ఆ రాత్రి...ఆ ఇంట్లో... మూడు వాటాల్లోవున్న ఆ ఇద్దరు ఆడపిల్లలకి... ఆ జిహ్వ చచ్చిన బ్రహ్మచారికీ ఎవరికీ నిద్ర పట్టలేదు సరిగ్గా.

రేపు చేయబోయే వంటని గురించిన ఆలోచన్లతోనూ, అతనితో చెప్పుకో బోయే కబుర్లని గురించిన ఊహల్లోనూ ఆడపిల్లలిద్దరికీ నిద్రలేదు. ఆ ఇద్దరిళ్లలో తినబోయే విందు భోజనం గురించిన ఆలోచన్లతో లొట్టలేసుకుంటూ ఎప్పుడు తెల్లవారుతుందా అని చూస్తున్న అతనికి నిద్రలేదు. అసలే తిండి ప్రియుడు.

ఆరోజు ఉగాది. సెలవేకాబట్టి... కొంచెం ఆలస్యంగానే లేచాడు పక్కమీంచి అసలు నిద్ర పట్టిందే తెల్లరుజామున కాసేపు.

మొహం కడుక్కుని గదిలోకొచ్చి తుడుచుకుంటుంటే గదిముందు చేతిలో కప్పుతో నిలబడింది విజయ.

ఒక్క భోజనానికే అనుకున్నాడు తను... కాఫీ కూడా ఇస్తోందే.. బతికాం. కాళ్లీడ్చుకుంటూ ఇప్పుడు హోటల్‌కి పోనక్కర్లేదన్న మాట... అయినా మొహమాటం ప్రదర్శించాలిగా కాస్తయినా. చాలా ఇబ్బందిగా మొహంపెట్టి థాంక్స్ చెప్తూ కప్పు అందుకున్నాడు.

"అరే... ఇదేవిటండీ... ఈ కాఫీలో ఏవో తేల్తున్నాయి?"

"పొద్దున్నే జోక్ చేయకండీ.. కాఫీ కాదది.. ఉగాదిపచ్చడి. నేనే చేశాను" ఎంతో గొప్ప, గర్వం ఫీలైపోతూ చూసింది.

"ఆ ఉగాది పచ్చడా?..." ఏ తేలో కుట్టినట్టే అరిచాడు.

"అబ్బా అలా అరుస్తారేమిటండీ? ఎవరైనావింటే నేను మిమ్మల్నేదో చేశానను కుంటారు..."

"ఆ పచ్చడి తినమనడం కంటే.. ఇంతకన్నా మీరేవన్నా చేసినా ఫర్వాలేదు.."

"ఛీ పొండి..." సిగ్గుతో మెలికలు తిరిగిపోయింది ఏవేవో ఊహించుకుని.

ఆ సిగ్గులు వయ్యారాలు గమనించే స్థితిలో ఉన్నాడా?

"చూడండీ.. మరి... మీరేమీ అనుకోకపోతే... నాకసలు... చిన్నప్పటి నుంచీ ఉగాది పచ్చడంటే ఇష్టం లేదండీ..."

"భలేవారేనే... ఉగాదిపచ్చడి తినడానికి ఇష్టా ఇష్టాలే మిటండోయ్! కంపల్సరీగా అందరూ ఉగాది రోజున పొద్దున్నే ఇష్టంవున్నా లేకపోయినా ముక్కు మూసుకుని మందులా అయినా సరే ఇది మింగ వలసిందే!"

గుండెల్లో రాయి పడింది శ్రీనివాసరావుకి.

"కానీ ఏవండీ... ఉగాది పచ్చడి... ఇలా కప్పుల్లో పోసుకుని తాగరను కుంటానండీ. చిన్న చెంచాతో అరిచేతిలో కాస్త వేసుకుని నాకుతారను కుంటానండీ..." ఏడుపుమొహంతో చూశాడు చేతిలో కప్పువంక.

"ఎందులోనూ నాకు పీనాసి బుద్ధులు లేవండోయ్... మా నాయనమ్మలాగే నాదీ భారీ చెయ్యి.... కావాలంటే ఆ కప్పుడూ తాగాక ఇంకో కప్పుడు పోస్తాను..."

"అయ్యబాబోయ్..."

"ఛ... మరీ అంత గట్టిగా అరిచి అలా చిందులెయ్యకండి... మనిద్దరి అన్యోన్యం, స్నేహంచూసి ఎవరికైనా కళ్లు కుట్టగలవు" మురిపెంగా మూతి కళ్లూ తిప్పింది.

వాళ్లకి కళ్లే కుడతాయో... ఇది తాగి నాకు ఒళ్లే తిరుగుతుందో ఆ దేవుడికే తెలియాలి. పరమేశ్వరా... పాహి.. పాహి....

"ఏవిటండీ!... మీలో మీరే గొణుక్కుంటున్నారు?.... నాచేత్తో నేను స్వయంగా చేసి అందిస్తే లొట్టలేసుకుంటూ తాగుతారనుకున్నాను. నా శాయక్తులా రుచిగా వచ్చేలా చేశాను. మా అమ్మ ఎలా చేస్తుందో ఏమో మరి! ఆవిడ చేసినట్టు రాలేదు. మీన మేషాల్లెక్కడ తారేంటండీ? తాగండీ..."

"అబ్బే .. లెక్క పెట్టేది మీనమేషాలు కాదండీ. ఇందులో ఎన్ని సరుకులు వేసుంటారా అని లెక్క పెడుతున్నాను."

"అబ్బా... దానికి లెక్కలు కూడా ఎందుకండీ... రెండే సరుకులు... ఓ పెద్ద గిన్నెడు చింతపండు నీళ్లలో ఓ రెండు మూడు దోసిళ్లు వేప్పువ్వు వేశాను. చాలా ఆరోగ్యం వేపపువ్వు తింటే..."

"హి... హి... హి..." పళ్లికిలించాడు.

"అవునవును చాలా ఆరోగ్యం... అసలూ ఓ పెద్ద వేపతోట వేసుకోవాలని ఎప్పట్నుంచో నాకు కోరికగా ఉంది"

"నిజంగానా?..." కళ్లింతింత చేసింది విజయ.

"ఎంచక్కా సీజన్లో ప్రతిరోజూ వేపపువ్వు పచ్చడి, దాంతోనే కూరా, దాంతోనే చారు చేసుకు తింటేసరి... సొంత తోటకదా కూరలకి బోలెడు డబ్బు పొయ్యడం తగ్గుతుంది. ఆరోగ్యానికి ఆరోగ్యమునూ"

"అవునవును" ఏడవలేక నవ్వాడు ఆమె మాటలకి.

"తాగండీ..."

"ఇది... ఆరారగా... ఆనందం అనుభవిస్తూ రుచులు ఆస్వాదిస్తూ తాగితే బాగుంటుందని నా ఉద్దేశం అందుకని కూర్చుని... లీజర్లీగా... మెల్లిమెల్లిగా తాగుతాను. మీరు వంట ప్రయత్నాలు చూసుకోవాలేమో పాపం మీ కాలస్యం అవుతుంది."

"సరే... అయితే.... ఇంక నేను నా పన్లో పడతాను..." పైట చెంగు దోపేసి వీరనారిలా వంటింటివైపు బయలుదేరింది.

పనుల్లోనే పడతారో... పెరట్లో పాకుడుమీదే పడతారో... మీ ఇష్టం... తాగుతాగు అని నా పీకల మీద పడకుండా ఉంటే అంతే చాలు. కాసేపయ్యాక కిటికీలోంచి పారబోసేద్దామని చూశాడు.

సరిగ్గా అప్పుడే బయట కిటకీవైపుకి వచ్చిన విజయని చూస్తూనే ఖంగు తిన్నట్టయి... బయటికి చా పబోతున్న కప్పుని నోటి దగ్గర పెట్టాడు.

"ఎలా.. ఉందండీ!? బావుందా?" కళ్ళు టపటపలాడిస్తూ జిలేబీయో జాంగ్రీయో తింటున్న వాడిని అడిగినట్టు చాలా ఉత్సాహంగా అడిగింది. నోట్లో ఏమీ లేకపోయినా ఆ పచ్చడిమింగినట్టే ఓ గుటకవేసి యాక్షన్ చేసి... తనకెంతో ఇష్టమైన బొబ్బట్లు తిన్న మొహంలా పెట్టాలని ప్రయత్నించి చేతకాక... చివరికి విధిలేక వేదాంతిలా నవ్వాడు.

"చాలా బావుందండీ"... ఎదురుగా కప్పులో కాలకూట విషాన్ని పెట్టుకుని అంత నిబ్బరంగా ఆ ఆరు అక్షరాలూ ఎలా పలకగలిగాడో తనమీద తనకే జాలివేసింది.

"ఇంకో కప్పు తీసుకు రమ్మంటారా?" ఎంతో ప్రేమగా అడిగింది.

"అహహ... వొద్దండీ... దీంతోనే కడుపునిండిపోతే.... మళ్లీ మీరు చేసే వంటకాలు తినడానికి చోటుండదు" ఓ చేత్తో పొట్టమీద రాసుకున్నాడు.

"ఇంతోటి ఈ పచ్చడి నీళ్లకీ కడుపు నిండి పోతుందేవి టండీ? పోస్లెండి..." నవ్వుతో వెళ్లిపోయింది ఏ కళనుందో గానీ..."

ఆ కప్పు కిటికీలో పెట్టి ఓ దండం పెట్టాడు.

తలుపుమీద చిన్నగా తట్టిన చప్పుడు...

"ఎవరూ?" దగ్గరిగా వేసివున్న తలుపులు పూర్తిగా తీశాడు.

చేతిలో ఫ్లాస్కుతో ఎదురుగా ఉంది గాయత్రి. ప్రాణం లేచొచ్చినట్లయింది.

ఇప్పటికే కాఫీకి వెళ్లడం లేటయింది. సన్నగా తలనెప్పి మొదలవ బోతోంది. దేవుడే ఫ్లాస్కురూపంలో వచ్చినట్టుంది.

తెలివి తేటలంటే ఈ అమ్మాయివే.

"ఎందుకండీ మీరు శ్రమ తీసుకున్నారు పాపం... ఇదిగో... ఇప్పుడే... హోటల్‌కి బయల్దేర బోతున్నాను" అంటూనే అందుకున్నాడు ఫ్లాస్కు.

"హోటల్లో ఉగాది పచ్చడి పెడతారాండీ?"

ఆ పేరువింటూనే చేతిలో ఫ్లాస్కు వొదిలేయబోయి... ఓ చిన్న డిస్కో డాన్సుతో పడిపోకుండా పట్టుకున్నాడు దాన్ని.

"నాకెప్పుడూ కొత్తకొత్త ప్రయోగాలు చేయడం అంటే చాలా సరదా అండీ. వేపపువ్వు పచ్చడి ఎప్పుడూ ఒకేరకంగా ఎందుకు చేయాలి. అని నా సొంతబుర్ర ఉపయోగించి ఈ రోజు కొత్త పద్ధతిలో చేశాను. మీరు బావుందంటే ఏదైనా పత్రికకి పంపిస్తాను."

"ఓ... అలాగా!" నవ్వూ రావట్లేదు... ఏడుపు రావట్లేదు...జుట్టు పీక్కోవాలని పించింది శ్రీనివాసరావుకి.

"చింతపండు నీళ్లల్లో వేప్పువ్వూ, కారం, ఉప్పు, ధనియాలపొడి, పసువు, బెల్లం, కొంచెం మెంతిపిండీ, కొంచెం ఆవపిండీ వేసి బాగా మరగకాచాను.. వేడిమీద్దైతేనే ఎక్కువ రుచిగా ఉంటుందేమో చల్లారి పోవడం ఎందుకని ఫ్లాస్కులో పోసి ఇస్తున్నాను మీకు..."

"ఇంకా ఏవన్నా ఉన్నాయేమో వెయ్యాల్సినవి... వంటిల్లంతా ఓ పట్టుపట్టారా? ఏమీ మరచిపోలేదు కదా?..."

"లేదులెండి.. ఏవన్నా తర్వాత గుర్తొస్తే రాసి పెట్టుకుని.. మర్చిపోకుండా వచ్చే ఏడాది పచ్చడిలో వేసి చేస్తాను"

గొప్ప పని చేస్తారు... బతికుంటే బలుసాకు తినొచ్చన్నారు.. వచ్చే ఏడాది పండగకి మీకు కనబడితే ఒట్టు.. అసలు మీ ప్రయోగాలకి నేనే దొరికానా అమాయకపక్షిని.. అన్యాయంగా బలై పోతున్నాను. తీసుకుపొండి మీ ఫ్లాస్కు.. ఈ మాటలన్నీ పైకే అన్నాననుకున్నాడు. ఒక్కమాటైనా నోట్లోంచి బయటికి వస్తేనా? లోలోపల మనసు మూలగడంతప్ప.

ఆ అమ్మాయిలిద్దరూ ఇచ్చిన ఉగాది పచ్చడి అని చెప్పడానికి వీల్లేని ఆ కషాయాన్ని, వాళ్లు చూడకుండా బయట పారబొయ్యడం ఓ పెద్ద ఎడ్వంచరే అనిపించింది అతని ప్రాణానికి.

ఆ ఎడ్వంచర్ పూర్తయ్యాక కాస్త తేలిగ్గా పీల్చుకున్నాడు గాలి.

★★ ★★ ★★

ఒంటిగంట దాకా భోజనానికి పిలుపే రాలేదు.

అకలితో ఆవురావురుమని ఉన్న శ్రీనివాసరావు... కాలుకాలిన పిల్లిలా గదిలో అటూ ఇటూ తిరుగుతున్నాడు.

ఇంటి భోజనం దిట్టంగా లాగించాలన్న ఉద్దేశంతో హోటల్ టిఫిన్ తినకుండా, కాఫీ ఒకటే తాగి వచ్చాడివ్వాళ. ఆకలి మండి పోతోంది. ఇప్పుడు ఒంటి గంటకి పిలుపొచ్చింది.

విజయ తండ్రి రామనాథం పక్కన పీటమీద ఆసీనుడయ్యాడు శ్రీనివాసరావు. ఇద్దరూ కూచ్చున్నాక అప్పుడు వడ్డన మొద్దలు పెట్టింది విజయ. పసుప్పచ్చ టిద్రవం లాంటిదేదో వడ్డిస్తుంటే కుతూహలం చంపుకోలేక యధాలాపంగా అడిగేశాడు "ఏవిటండీ అది."

"పప్పండీ పప్పు!..." అంత మాత్రం తెలియదా అన్నట్టు చూస్తూ చేతిలో ఉన్న గరిట అతని మొహమ్మీదే పెట్టినట్టే ముందుకీ వెనక్కీ ఆడించింది.

ఉలిక్కిపడి కాస్త వెనక్కి జరిగాడు.

ఆ పప్పు అనే పదార్థంలోంచి కొంత భాగం రయ్యిన జారుకుంటూ ఆకులోంచి పీట కిందికి వెళ్ళిపోయింది.

కూర కలుపుకుందామని చెయ్యి పెట్టాడో లేదో శ్రీనివాసరావు చేతివేళ్లు ఒకదానికొకటి అతుక్కుపోయాయి. జిగురేసినట్టు కష్టపడి కూరలోంచి వేళ్లు బయటికి లాక్కున్నాడు. తీగెపాకంలా సాగింది.

"బెండకాయ కూరండీ. నేనుపోసిన నీళ్లు కొద్దిగా ఎక్కువైనట్టున్నాయి. అంతే" కళ్లు మిలమిల లాడించింది విజయ.

రామనాథం గారిని ఓరగా చూశాడు శ్రీనివాసరావు.

కూరతో ఆయన నోరు అతుక్కుపోయింది... ఇంకేం మాట్లాడతాడు పాపం! అర్థం చేసుకుని జాలిపడ్డాడు ఆయనమీద.

"ఏవిటండీ... బొత్తిగా ఏవీ తినడంలేదు మీరు?" అనకుండా ఉండలేక పోయింది విజయ.

"ఆ.... అబ్బే... లేదండీ... తింటున్నాగా... అయినా అట్టే ఆకలిగా లేదండీ... హోటల్లో టిఫెన్ ఎక్కువగా తినేశాను" ఓ ప్రక్క కడుపులో ఆకలి మండిపోతున్నా కూల్‌గా జబాబిచ్చాడు.

నొచ్చుకుంది విజయ "మా ఇంటికి భోజనానికి వస్తూ హోటల్లో టిఫిన్ హెవీగా తినేసి రావడం ఏవిటండీ మీరు!"

"బ్రతికి పోయావులే... టిఫిన్ అయినా తినొచ్చావు" మనసులోనే అనుకున్నాడు రామనాథం.

దోసకాయపచ్చడి నోట్లో పెట్టుకోగానే నాలిక కోసేసుకోవాలని పించింది.

"అమ్మాయ్! దోసకాయ చేదు చూడలేదా?" తాపీగా తండ్రి అడుగుతున్న ప్రశ్నకి నోరెళ్లబెట్టింది విజయ.

అడ్డంగా ఊపింది తల.

ఇంక చారుగానీ, పులుసుగానీ తినే ధైర్యం చేయలేక పోయాడు శ్రీనివాస్‌రావు. మజ్జిగ మధ్యావస్థలో ఉంది.

అటు పాలూకదూ... ఇటు మజ్జిగా కాదు... మధ్యావస్థలో ఉంది

ఆసలే మజ్జిగంటే చిన్నప్పటుంచీ కూడా పెద్ద ఇష్టలేందు ఆతనికి. అందులో ఇటువంటి పాలవాసనా పాలరుచితో ఉన్న మజ్జింగంటే ముందే డోకొస్తుంది.

ఖాళీ కడుపుతో లేచి చెయ్యికడుక్కున్నాడు.

"ఎలా ఉందండీ నా వంట?"

ఏడవలేక నవ్వాడు. బావుందని అబద్ధం చెప్పడం ఇష్టంలేక బాగులేదని నిజం చెప్పలేక "అబ్బా! ఏం వంటండీ" అంటూ దీర్ఘం తీసి ఊరుకున్నాడు. కావలసిన విధంగా తను అర్థం చేసుకుని తెగ సంతోష పడిపోయింది విజయ. ఎటొచ్చీ.. సరిగ్గా అర్థం చేసుకున్నది రామనాథం మాత్రమే.

తన గదిలోకి వెళ్తూనే మంచమ్మీద అడ్డంగా పడిపోయాడు. నిజానికి వాళ్లింట్లో బోంచేసి రాగానే భుక్తాయాసంతో అలా పడిపోతానని వెర్రి కలలు కన్నాడు. కానీ... ఇప్పుడు పడ్డాడు... నీరసంతో, బయటికెళ్లి ఏదైనా తినొద్దామన్నా ఓపిక చచ్చిపోయింది. ఎవరిమీద కోపం తెచ్చుకోవాలో అర్థంకాలేదు... అందుకు తీరికూచుని విజయ తల్లిమిద కోపం తెచ్చుకున్నాడు... అవునుమరి... అవిడ ఊళ్లో లేకుండా ఎందుకు పోవాలీ పండగపూటా... ఇంక ఆశలన్నీ రాత్రి భోజనమ్మీద పెట్టుకుని... మాయాబజార్లో ఎస్వీ రంగారావుని ఊహించుకుంటూ వివాహ భోజనంబు వింతైన వంటకంబు అని సన్నగా కూనిరాగం తీసాడు జీవితమ్మీద విరక్తి కలగకుండా ఉండేందుకు.

★ ★ ★

ఆ రాత్రి..........

బలిపశువుని తీసికెళ్తున్నట్టే.... దగ్గరుండి మరీ నడిపించుకెళ్లాడు గాయత్రి తండ్రి శివరామయ్య తమ వాటాలోకి శ్రీనివాసరావుని.

కంచంలో బొగ్గుముక్కలు చూడగానే కళ్లు తేలేసాడు... ఇదేవిటీ? ఇదేదో జానపద సినిమాలో మిస్టరీలా వుందే? ఓ ప్రక్క ఆకలి దంచేస్తోంది. గుత్తివంకాయ కూర తలచుకుని నోట్లో నీళ్లూరి పోతున్నాయి. దిక్కులు చూసాడు కూరగిన్నె కనపడుతుందేమో అని. ఆ బొగ్గుముక్కలే వంకాయముక్కలని తెలియగానే అదిరిపడ్డాడు. ఇంతెత్తున పీటమీద ఎగిరిపడ్డానని అనుకున్నాడు గానీ పడలేదు కష్టాలు పడీపడీ గుండె బండబారిపోయిన వాడికిమల్లే బిగుసుకుపోయాడు కూర్చున్న పీటమీదే.

బ్రేవ్‌మని త్రేన్చాడు శివరామయ్య.

వింతగా చూశాడు ఆయన్ని.

నిర్వికారంగా ఆపర శాంతమూర్తి అవతారంలా వుంది ఆయన మొహం కూతురి వంట సంగతి ఎన్నాళ్లగానో ఎరిగున్నవాడు ప్రతిరోజు వంటింట్లో కూతురు చేసే ప్రయోగాలు గమనిస్తున్నాడు. కూతురి మనసు కష్టపెట్టడం ఇష్టం లేక నొప్పించక తానొవ్వక తిరుగువాడు అన్నట్టు మేనేజ్ చేసేస్తున్నాడు. ప్రతిరోజూ రెండుపూటలా దిట్టంగా హోటల్లో తినేసివస్తూ.... ఇప్పుడొచ్చింది ఆ హోటల్లో తేనుపే అందుకే... పొట్ట నిండుగావున్న ఆయనకి... కూరెలావున్నా కొంప మునిగిందిలేదు.. పచ్చుడెలావున్నా పట్టింపులేదు....

రమా రమణ గోవిందో హారి.. మనసులోనే ఆ ఏడుకొండలవాడికి దండం పెట్టేసుకున్నాడు శ్రీనివాస్‌రావు.

శివరాత్రినాడు ఉపవాసం వుంటే ముక్తి, మోక్షం అంటారు. ఉగాదిరోజు ఉపవాసం వున్నవాళ్లక్కూడా అలాంటివేమన్నా వుంటే బావుంటుంది. ఇవాళ రెండు పూటలా కంచం ముందు కూర్చోవడమే తప్ప తిన్నదిలేదు... తనమీద తనకే జాలేసి పోయింది.

రాత్రంతా తీయతీయని ఊహల్తో విజయకి నిద్రలేదు. ఇటు గాయత్రికీ నిద్రలేదు.

“విజయకంటే నేనే కాస్త అందంగా వుంటాను. తప్పకుండా నన్ను ప్రేమిస్తాడు. అతనికిష్టమైన గుత్తివంకాయ కూర చేసి పెట్టానుకూడా... మొగవాడి ప్రేమ పొందాలంటే వాళ్ళకిష్టమైనవి వొండి పెట్టడమే మంచిమార్గం అని ఒకప్పుడు నాయనమ్మ అనేది... దానికి తనని పెళ్ళాడతాడు. ఆ మాట నాలుగురోజుల్లో అతని నోట్లోంచి వచ్చి తీరుతుంది” ఇది గాయత్రి అభిప్రాయం అందుకే... ఆ అభిప్రాయంతోనే... ఆ సంతోషంతో ఆమెకి నిద్రే పట్టలేదు.

“నాలో వున్న కళ గాయత్రి మొహంలో ఎక్కడుంది? అతని పరిచయం పెంచుకోవాలని పండగ వంకతో అతన్ని భోజనానికి పిలిచాను. ఇంక ఈ స్నేహం చిక్కుడుపాదులా అదే అల్లుకుపోతుంది... విరగగాసిన చిక్కుడుపాదులా కళకళ్ళాడి పోతుంది... అది చూసి గాయత్రి మొహం వెలవెలపోతుంది” అని విజయ ఉద్దేశం. ఈ రకమైన అల్లిబిల్లి ఊహల్తో అనందంతో నిద్రపడితే ఒట్టు.

★ ★ ★

తెల్లవారింది ఓ రిక్షా ఆగింది గేటుముందు.

ఓ ఇద్దరు... తండ్రీ కూతుళ్ళల్లా వున్నవాళ్లు రిక్షాలోంచి సూట్‌కేసుతో దిగడం చూసి వాళ్లని ఆసక్తిగా చూస్తూ వాళ్లవాళ్ళ గమ్మాల్లో నిలబడ్డారు విజయ, గాయత్రి.

“అరె... మీరా? రండి మామయ్య రండి... ఏమిటిలా హఠాత్తుగా?... ఉత్తరం రాస్తే స్టేషన్‌కి వచ్చేవాడినిగా?” లోపల్నుంచి పరుగెత్తుకొచ్చాడు శ్రీనివాసరావు.

“అమ్మాయి స్నేహితురాలి పెళ్ళిట ఈ ఊళ్లో... రాకపోతే ఆ స్నేహితురాలు ఊరుకోదు... సరే నాకూ ఎలాగో ఒక పూట పనుంది ఈ ఊళ్లో... రెండూ కలిసొస్తాయని బయల్దేరిపోయాం”

“ఈయన నా మేనమామండీ... ఈయన కూతురు ఈమె... నా కాబోయే భార్య కూడాను” చిరునవ్వుతో తన మేనమామని, ఆయన కూతుర్నీ పరిచయం చేశాడు శ్రీనివాసరావు గుమ్మాల్లో నిలబడిన విజయకి, గాయత్రికి.

మొహాలు తేలేసి నోళ్లు వెళ్లబెట్టారు వాళ్లిద్దరూ.

ఊహలు తలకిందులై కథ అడ్డం తిరిగినందుకు తేరుకోలేకపోయారు కాసేపటిదాకా.

★ ★ ★